# రోతబ్రతుకు

" భిక్షాందేహి!" గట్టిగా అరుస్తున్నాడు ఓ ముసలాడు ఇంటిముందు నుల్చుని.

" పోయిరా - పోయిరా !" ఇంకా గట్టిగా చెప్పాడు బలరామయ్య- నోట్లు లెక్కపెట్టుకుంటూ.

" అయ్యా - రెండు రోజుల నుండి తిండితిప్పలు లేవు - ధర్మరాజులు కనికరించాలి" దీనంగా వేడుకున్నాడు ముసలాడు.

" పోవయ్యా - ఎన్నిసార్లు చెప్పాలి - మనిషికో మాట - గొడ్డుకో దెబ్బ !" కసురుకున్నాడు నోట్లు జేబులో పెట్టుకుంటూ బలరామయ్య.

" ఓ రూపాయి అన్నా దానం చేయండయ్యా" మళ్ళీ వేడుకున్నాడు అతను.

ఈసారి బలరామయ్యలోని సహనం నశించిపోయింది. ఎదురుగా వున్న దుడ్డుకర్ర అందుకుని విసురుగా బయటకు వచ్చాడు.

" ఏం నీకు బుద్ధిలేదా ... ఎన్నిసార్లు చెప్పాలి? గాడిదలాగా అరుస్తూ మా పన్లు చెడగొడతావు! మర్యాదగా ఇక్కడ్నించి కదులు.." మీదమీదకి పోతూ హూంకరించాడు బలరామయ్య.

" అంతకోపం ఎందుకండి... పొమ్మని చెప్పచ్చుగా... నేను కూడా మీకంటే బాగా బ్రతికినవాడినే" అతను వస్తున్న కన్నీరును తుడుచుకుంటూ వెనుదిరిగాడు. అవమాన భారంతో అతని తలవంగి పోయింది.

ఇదంతా చూస్తున్న రవీంద్రకు బాధ కలిగింది. వెంటనే బయటకు వచ్చి గట్టిగా కేకవేశాడు "ఓ అబ్బీ ! ఇటురా!" అంటూ.

బలరామయ్యకు కోపం తగ్గింది గాని ... రవీంద్ర పనిని ఆశ్చర్యంగా చూస్తున్నాడు... అతను నెమ్మదిగా వెనక్కి వచ్చాడు.

" దండాలండి... రెండు రోజుల నుండి ఏమీ తినలేదు. కళ్లు తిరుగుతున్నాయి" నీరసంగా అన్నాడు రవీంద్రతో.

" ఈ డబ్బు తీసుకుని ... ఇవ్వాళన్నా ఎంగిలిపడు" అంటూ జేబులోంచి యాభై రూపాయలు తీసిచ్చాడు రవీంద్ర, అతన్ని ఎగాదిగా చూస్తూ.

ముసలాడు ఆశ్చర్యపోయి ... కన్నీటితో ఆ నోటు అందుకుని అతని పాదాలకు నమస్కరించాడు. పోతూపోతూ ఆశ్చర్యంతో స్థాణువులా నిలబడ్డ బలరామయ్య వంక తిరస్కారంగా ఒక చూపు విసిరి వెళ్ళాడు.

" నే వస్తాను" సెలవు తీసుకోబోయాడు రవీంద్ర.

బలరామయ్య తేరుకుని "ఒక్క నిమిషం లోపలికి రా!" అన్నాడు.

ఇద్దరూ వరండాలోకి వచ్చి ఎదురెదురు కుర్చీల్లో కూర్చున్నారు.

" నీ గురించి నువ్వేమనుకుంటున్నావు రవీంద్రా! ఓ బలిచక్రవర్తి అనో దానకర్ణుడనో ... శిబిచక్రవర్తి అనో అనుకుంటున్నావా? మా యింటికి అడుక్కోవడానికి వచ్చిన బిచ్చగాడికి ... నేను పొమ్మంటే.. నువ్వు ఏకంగా యాభై నోటు యిచ్చి పంపుతావా? నీకు డబ్బులు ఎక్కువయ్యాయా... లేదా నన్ను అవమానం చెయ్యాలనుకున్నావా?' తీవ్రంగా అడిగాడు బలరామయ్య.

" సారీ ! దీన్లో మిమ్మల్ని కించపరిచే ఉద్దేశ్యం నాకు లేదు... అలా అని మీకనిపిస్తే క్షమించండి!" తలవంచుకుని చెప్పాడు రవీంద్ర.

" లేకపోతే ... నెలకు నాలుగు వేలు వడ్డీ కడుతున్న వాడివి, దర్జాగా యాభై నోటు తీసిచ్చావంటే ఇంకేమనుకోవాలి!" రెట్టించాడు.

" నాకు జాలి కొంచెం ఎక్కువ" చెప్పాడు రవీంద్ర.

" అంటే నాకు లేదనా... నేను కసాయివాడ్ని అనుకున్నావా? బయట మూడు, నాలుగు రూపాయల వడ్డీకి కూడా అప్పుదొరకదు... అటువంటిది నేను నీకు రెండు రూపాయల వడ్డీకే ఏ ష్యూరిటీ లేకుండా అప్పు యిచ్చాను అంటే నెలకు నీకు రెండు వేలు మిగిల్చాను. అధమ పక్షంలో అటువంటిది నా దగ్గరే నువ్వు బడాయికి పోతే ఎలా?" క్లాసు తీసుకున్నాడు బలరామయ్య.

" ఏమో కాని... అతను రెండు రోజులుగా తిండి తినలేదంటున్నాడు... అతని వయసు చూస్తే అరవై దాటి ఉంటుంది. ఈ రోజు కూడా తిండి దొరక్కపోతే ఛస్తాడేమోనని జాలి కలిగి యిచ్చాను" చెప్పాడు రవీంద్ర బాధపడుతూ.

" అంత జాలి కలిగితే ఓ రూపాయి ఇస్తే సరిపోయేది."

" ఈ కాలం రూపాయికి టీ నీళ్ళు కూడా రావు- కడుపు నిండా భోంచేయాలంటే యిరవై అన్నా కావాలి... అతనిని నమ్ముకుని ఎంతమంది ఉన్నారో!" చెప్పాడు.

" అచ్చా ! అంత దీనజనోద్ధరణ దృక్పథం నీకుందా ... వచ్చే నెల నా రెండు లక్షలు నాకు జమ చెయ్యి... నాకు డబ్బుతో చాలా పనుంది" కోపంగా చెప్పాడు బలరామయ్య.

ఊహించని ఈ పరిణామానికి రవీంద్ర బిత్తరపోయాడు. ఇంతలో బయట నుంచి ఓ సాధువు శంఖం ఊదాడు.. గంటలు గణగణ మ్రోగించాడు భిక్షకోసం.

" చూడు బయట ఇంకోతను వచ్చాడు. అతనికి ఎంతిస్తావు?" అడిగాడు ఎగతాళిగా బలరామయ్య.

" ఇది మీ యిల్లు ... మిమ్మల్ని అడుగుతున్నాడు" ... రవీంద్ర.

" నేనైతే పైసా ఇవ్వను.. ఇలాంటి అడ్డగాడిదల వలన మన దేశం చెడిపోతున్నది.. పని పాటా లేకుండా సోమరులుగా మారి పోతున్నారు... నీలాంటి దానాలు చేసేవాళ్ళవలన"

బలరామయ్య చెప్పాడు కోపంగా.

" భవతీ భిక్షాందేహి!" మళ్ళీ శంఖం బజాయించాడు... గంటలు గణగణ కొట్టాడు సాధువు బయటినుంచి.

రవీంద్ర జేబులోంచి పది రూపాయల నోటు తీసుకుని బయటకు వెళ్ళి దానం చేశాడు. సాధువు వెళ్ళిపోయాడు. రవీంద్ర తిరిగి బలరామయ్య దగ్గరికి వచ్చాడు.

" ఇంత మంచి ఉద్యోగం చేస్తున్నా ... నువ్వు అప్పులపాలు ఎందుకవుతున్నావో నాకిప్పుడు అర్థమైంది.. ఇలా చేసుకుంటూ పోతే కొన్నాళ్ళకు నువ్వు కూడా జోలె పట్టుకుని అడుక్కోవలసిన అవసరం ఏర్పడుతుంది" కసిగా అన్నాడు బలరామయ్య.

" మీలాంటి ధర్మాత్ములు వున్నంతకాలం ఆ పరిస్థితి రాదు."

" ఏం ఎగతాళి చేస్తూన్నావా .. అవునయ్యా .. బిచ్చగాళ్ళకు దానం చేయడం నాకిష్టం లేదు. మన భారతదేశానికి పట్టిన జాడ్యాలలో అడుక్కోవడం ఒకటి!" బలరామయ్య అన్నాడు విసురుగా.

" అలా అనుకోవద్దండి ... కర్మసిద్ధాంతం తెల్సుగా మీకు ?" రవీంద్ర.

" ఖర్మకొద్దీ ఆ కర్మసిద్ధాంతమే మన దేశాన్ని నాశనం చేసింది రవీంద్ర. ఎదుటివాడు ఏం చేస్తున్నా వాడి కర్మకు వాడేపోతాడులే అన్న ఉదాసీనత మన దేశాన్ని నాశనం చేస్తున్నది. ముస్లిం కంట్రీసులో లాగా కన్నుకు కన్ను ... చెయ్యికి చెయ్యిలా శిక్షిస్తూ ఉంటే దొంగతనాలుండవు.. ఈ ముష్టి వాళ్ళు కనపడరు" బలరామయ్య.

" బలరామయ్యగారు .. మీకో సంగతి తెల్సా.. ఎవరూ కావాలని అడుక్కోరు.. సర్వసంగ పరిత్యాగుల సంగతి.. సాధువుల సంగతి వదిలేద్దాం... మామూలుగా మనకు మన సమాజంలో కనిపించే ముష్టివాళ్ళల్లో ఇష్టపడి ముష్టి ఎత్తుకునేవాళ్ళు పదిశాతం కూడా ఉండరు. తొంభై శాతం మంది గతిలేక ... తమల్ని బ్రతికించుకోవడం కోసం అడుక్కుంటారు. ప్రాణాలు నిలబెట్టుకోవడం ఎవరికైనా ప్రథమ ధర్మం కదా మరి దురదృష్టం కొద్దీ ధనమంతా ఒక శాతం ప్రజల దగ్గర పేరుకు పోతున్నది. మిగతావారు దుడ్డు కోసం నానా పాట్లు పడుతున్నారు" నిట్టూర్చాడు రవీంద్ర.

" ఈ మెట్టవేదాంతం నాకెందుకుగాని... ఎలా చేస్తావో ఏమో వచ్చే నెలలో నా బాకీ తీర్చెయ్యి... లేకపోతే" ఆగాడు బలరామయ్య.

" తమరు అలా కోప్పడితే ఎలా ... ఇంత హఠాత్తుగా డబ్బులిమ్మంటే ఎక్కడ్నించి తీసుకు రాగలను... ఓ ఆర్నెల్లు గడువు ఇస్తే తప్పకుండా తీర్చేస్తాను" రవీంద్ర బ్రతిమాలాడు.

" అదేం కుదరదు... వచ్చే నెల ఇవ్వలేక పోతే నాలుగు రూపాయల వడ్డీ ఇచ్చుకోవలసి వస్తుంది" గట్టిగా చెప్పాడు బలరామయ్య.

" అయ్యా ! ఇప్పటికే నెలకు నాలుగువేలు మీకు వడ్డీ కట్టి నానా గడ్డీ తింటున్నాను...

ఇంకో నాలుగు వేలు కట్టమంటే నా కుటుంబం పస్తులు పడుకోవలసి వస్తుంది. ఆలోచించండి ప్లీజ్ !"

" ఈ ఆలోచన అప్పు చేసేటప్పుడు ఉండాల్సింది.. తీర్చే స్తోమత లేనప్పుడు అప్పు ఎందుకు చెయ్యాలి?" అడిగాడు బలరామయ్య.

" అయ్యా ! కూతురు పెళ్ళికి తప్పని సరిగా చేయాల్సి వచ్చింది.. అది అటుంచి నాకో కథ గుర్తుకొస్తున్నది... మీకు కథలంటే ఇష్టంగదా ... వింటానంటే చెబుతాను" రవీంద్ర ఆగాడు.

" ఊ కాని ... నా బలహీనత నీకు తెల్సు కదా.. కథలంటే చెవి కోసుకుంటాను.. చెప్పు.." బలరామయ్య వినే దానికి సిద్ధమయ్యాడు.

రవీంద్ర కళ్ళుమూసుకుని... మూడ్ క్రియేట్ చేసుకుని చెప్పసాగాడు!

అనగనగా ఒక ఊరు ... పట్టణం కాదు. అలాగని పల్లెటూరు కాదు. అన్ని వసతులు కలిగిన మంచి టౌను. వ్యాపారాలు బాగా జరిగే ఊరు. పరంధామయ్యగారికి ఆ వూరులో ఒక బట్టల అంగడి ఉంది. ఆ ఊళ్ళోని పెద్ద బట్టలషాపుల్లో అది ఒకటి. అక్కడ మామూలు చీరలు దగ్గర్నించి... పట్టుబట్టల దాకా .. కంచి.. ధర్మవరం లాంటి ఖరీదైన చీరల దాకా అన్నీ దొరుకుతాయి. ఆయన వ్యాపారం మూడుపువ్వులు ఆరుకాయలుగా వర్ధిల్లుతున్నది.

ఆయనకు ఇద్దరు కొడుకులు.. ఒక కూతురు. అనిరుధ్, దీపక్‌లు పెద్దవాళ్ళయి ఇంజనీరింగు చేస్తున్నారు. దివ్య ఇంటరులో చేరింది. అప్పుడు అస్సలు కథ మొదలైంది.

ఉన్నట్టుండి షాపులో జరీచీరలు.. ఖరీదైన బట్టలు చాలా మాయమయ్యాయి. వేసిన తలుపులు వేసినట్లే ఉన్నాయి... తాళాలు బ్రద్ధలు కాలేదు. కాని ఆయన పనిమీద ఊరికిపోయి వచ్చేసరికి మూడు లక్షల సరుకు మాయమై పోయింది. ఇదంతా జరిగి దాదాపు రెండు దశాబ్దాలు అవుతున్నది.

షాపులో పదిమంది సేల్సు బాయిసు.. గరల్సున్నారు... వీరందరి మీద జయరామ లింగయ్య అజమాయిషీ అతని దగ్గర షాపు తాళాలు ఉంటాయి.

పోలీసు కంప్లెయింటు ఇచ్చాడు. యస్సై వచ్చి అందరిని విచారించాడు. అందరినీ సెల్లులో వేస్తాను నిజం చెప్పమని బెదిరించాడు. ఎవరినుండి సమాధానం రాలేదు. చివరికి యస్సై రామలింగయ్యని జైల్లో పెట్టించాడు నిజం తేలాలని ఆ రాత్రి రామలింగయ్య భార్య సీతమ్మ వచ్చి ఏడ్చింది.

" బాబుగారు... ఇంతకాలం మిమ్మల్ని నమ్ముకుని బ్రతుకుతున్నాం... మా ఆయన పదిహేనేళ్ళుగా ఎంతో విశ్వాసంగా మీ దగ్గర పనిచేస్తున్నాడు.... ఈ రోజున ఆయన్ను అరెస్టు చేవారు... పిల్లపెళ్ళి వచ్చేనెలలో ఉంది.. ఈ విషయం బయటకు పొక్కిందంటే ఆ పెళ్ళి కూడా ఆగిపోతుంది. దొరక్క దొరక్క మా స్తోమతుకు ఓ మంచి సంబంధం దొరికింది.

మీరే ఆ పెళ్ళికి పాతికవేలు సాయం చేస్తానని మాట యిచ్చారు... ఆ పెళ్ళి ఆగిపోతే మేమంతా ఆత్మహత్య చేసుకుంటాం" అంటూ సీతమ్మ పరంధామయ్య గారి కాళ్ళమీద పడింది.

" నిజమేనమ్మా ! కాని నమ్మించి మోసం చేస్తే నేనేం చేసేది .. ఒకటా రెండా మూడులక్షల సరుకు మాయమై పోయింది. ఓ రెండు రోజులు నేను ఊళ్ళో లేకపోయేసరికి తాళాలు నా దగ్గర .. మీ ఆయన దగ్గర ఉంటాయి... నా సొమ్మును నేను దొంగతనం చెయ్యను గదా! ఆ సరుకును నాకు అప్పచెప్పితే జరిగింది క్షమించి... అతన్ని విడిపిస్తాను" అని చెప్పాడు పరంధామయ్య.

" అయ్యగారు .. మా ఆయన నిర్దోషి... పరుల సొమ్మును పాముతో సమానంగా భావిస్తాడు.. అటువంటి అతన్ని మీరు అనుమానిస్తారా?" సీతమ్మ బాధపడుతూ అడిగింది.

" నేను కాదు ... పోలీసుల అనుమానం... ప్రథమ ముద్దాయి మీ ఆయన .. ఇంకా ఇద్దరు ముగ్గురున్నారు కాని వాళ్ళను తప్పు పట్టలేక పోయారు" చెప్పాడు పరంధామయ్య.

" మా ఆయన ఈ రాత్రిలోగా ఇంటికి తిరిగి రాలేక పోతే నేను ఆత్మహత్య చేసుకుంటాను. నేను చస్తే మా ఆయన బ్రతకడు. ఆయనా ఆత్మహత్య చేసుకుంటాడు. ఇంక మేమిద్దరం ఛస్తే మా పిల్ల నళిని అస్సలు బ్రతకదు. ఇదంతా తనవల్లేనని ఆత్మహత్య చేసుకుంటుంది. ఆలోచించండి ... కేవలం అనుమానం మీద మీరు ముగ్గుర్ని పొట్టన పెట్టుకుంటారా! ధర్మ ప్రభువులు..." రోషంగా అడిగింది సీతమ్మ.

" ఏంటే బెదిరింపు ... చేసినది చాలక మళ్ళీ ఇదొకటా సీతమ్మా!" అరుంధతి... పరంధామయ్య భార్య సీతమ్మను కోప్పడింది.

" మా బీదోళ్ళకు ఏం చేతనవుతుందమ్మా! చేతనైనంత సేవ చేయగలం... దగా పడ్డప్పుడు ప్రాణం.. పణంగా పెట్టగలం.. సీతమ్మ అంది.

" సీతమ్మా ! నువ్వు నిశ్చింతగా వెళ్ళమ్మా ! మీ ఆయన మీ దగ్గరికి వస్తాడు" అంటూ పరంధామయ్య ఆమెను ఇంటికి పంపించాడు.

" ఏమండీ ! ఆమె బెదిరించిందని రాఘలింగయ్యను విడిపిస్తారా? తరువాత మీ మూడు లక్షలు మీకు రావు" చెప్పింది అరుంధతి.

" ఇక్కడ మూడు లక్షలు కాదు ముఖ్యం... మూడు ప్రాణాలు ముఖ్యం. రామలింగయ్య నమ్మకస్తుడు... అతను ఆ దొంగతనం చేసి ఉండడు. కాకపోతే అతని అసమర్థత మూలంగా దొంగతనం, జరిగి ఉండవచ్చు" చెప్పాడు పరంధామయ్య.

" నేను అనుకోవటం దొంగతనం ఇతను చేసి ఉండకపోయినా, యితగాడికి వాటా ఉండి ఉండవచ్చు. నాలుగుతంతే నిజం అదే బయటకు వస్తుంది. మీరు మెత్తబడద్దు.. పోలీసులు కొన్నాళ్ళకు మొత్తం కూపీ లాగుతారు" సలహా ఇచ్చింది అరుంధతి.

" అదేమో తెలీదు కాని... రామలింగయ్య కూతురి పెళ్ళి వచ్చేనెలలో ఉన్నది వాస్తవం ... సీతమ్మ చెప్పినట్లు అతనికి చెడ్డపేరు వస్తే ఆ పెళ్ళి ఆగిపోవచ్చు... ఇంకా ఏమైనా కావచ్చు.. ఎలాగూ పోయింది పోయింది... మళ్ళీ ఇంకో పాపం మనకెందుకు?" పరంధామయ్య బాధపడుతూ అన్నాడు. పాపభీతి ఆయనకు ఎక్కువ !

" మీ మంచితనాన్ని ఎదుటి వ్యక్తులు చేతకానితనంగా భావించి ఆటలాడు తున్నారు... మంచి తనానికి ఒక హద్దు ఉండాలి" అరుంధతి

" కర్మసిద్ధాంతాన్ని నమ్మినవాడిని. క్రిందటి జన్మలో నేను రామలింగయ్యకు బాకీపడి ఉంటాను.. అందుకే ఇప్పుడు ఆ బాకీ తీరి ఉంటుంది.... లేదా.. అతను ఇప్పుడు చేసిన బాకీ వచ్చే జన్మలోనైనా తీర్చుకుంటాడు.." అంటూ పరంధామయ్య కేసు విత్‌డ్రా చేసుకుని రామలింగయ్యను విడిపించాడు... అరుంధతి అడ్డుపడినా వినకుండా.

ఆ తర్వాత రామలింగయ్య కూతురు పెళ్ళి ఎటువంటి ఆటంకాలు లేకుండా జరిగిపోయింది. అంతేగాకుండా పరంధామయ్య ఆ పెళ్ళికి పాతికవేలపైన సహాయం చెయ్యడమే కాకుండా పెళ్ళిబట్టలు వాళ్ళింట్లో అందరికీ ఉచితంగా యిచ్చాడు. దొంగతనం మూలంగా అతని వ్యాపారం సాఫీగా జరగటం లేదు.

రోజులు దొర్లుతున్నాయి. అంత మంచి మనిషికి రోజులు బాగా లేవు... ఆయన ముగ్గురికి చిట్‌ఫండ్‌లో హామీ ఇచ్చాడు. వాళ్ల డబ్బులు ఎగ్గొట్టి ఊళ్ళొంచి పారిపోయారు. ఆ రకంగా హామీ ఇచ్చిన మొత్తం పది లక్షల రూపాయలు ఈయన కట్టవలసి వచ్చింది.

అతికష్టంమీద కూతురి దివ్యకు మంచిసంబంధం తీసుకురాగలిగాడు. ఆ పెళ్ళికి కూడా మొత్తం ఆస్తి హరించుకుపోయింది... ఆ పైన ష్యూరిటీ గొడవలు కొన్ని.

ఈ లోగా అనిరుధ్... దీపక్‌లు ఇంజనీర్లయి అమెరికాకు వెళ్ళిపోయారు.. అక్కడ ఉద్యోగాలు చేసుకుంటూ అక్కడ స్థిరపడిపోయారు. వాళ్ళకు తండ్రి మంచితనం.. చేసిన పిచ్చిపనులు నచ్చలేదు... ఆయనతో సంబంధాలు తెంచేసుకున్నారు....

ఇక దివ్య అత్తగారు వాళ్లు దివ్యమీద ఆంక్షలు విధించారు. చితికి పోయిన పరంధామయ్యను పలకరించటమే మహాపాపంగా భావించారు. అలా ఆ దంపతులు ఒంటరివారై పోయారు. షాపు మూతపడింది.

కష్టాలు ఒంటరిగా రావన్నట్లు... పరంధామయ్య... అరుంధతిల ఆరోగ్యం బాగా దెబ్బతింది... వైద్యానికి... ఆపరేషన్లకు ఉన్నదంతా ఊడ్చుకుపోయింది... పనీ పాటా చేసుకు బ్రతుకుదామన్నా ఒంట్లో ఓపిక లేదు... చివరికి వీధి పాలయ్యారని మా వూళ్ళో చెప్పుకుంటూ ఉంటారు.

రవీంద్ర కథ ముగించాడు.

" పరంధామయ్య లాంటి మూర్ఖులకు 'సీతాపతి - చాపేగతి- చిప్పేగతి' సామెత

సరిపోయింది.. అసమర్ధతతో చేతులారా నాశనమై పోయాడు." కథలో లీనమై పోయిన బలరామయ్య అన్నాడు.

" పరంధామయ్య మంచితనం మీకు మూర్ఖత్వంగా కనిపించిందా?" రవీంద్ర ఆశ్చర్యంగా అడిగాడు.

" కాకపోతే... రామలింగయ్యను జైలు నుండి విడిపించకపోతే అతని డబ్బులు అతనికి వచ్చేవి కదా! దొంగలు బయటపడేవాళ్ళు కదా!"

" అదేమోగాని... సీతమ్మ ఆత్మహత్య చేసుకునేది.. ఆమె కూతురు నళిని పెళ్ళి ఆగిపోయేది.. దాంతో ఆయనకు పాపం చుట్టుకునేది... వచ్చే జన్మలో ఘోరనరకం అనుభవించేవాడు" రవీంద్ర బాధగా ఉన్నాడు.

" ట్రాష్ ! పాపం... పుణ్యం.. వచ్చే జన్మ ఇవన్నీ ట్రాష్!" బలరామయ్య.

" అంటే మీరనేది మనకు ఇంకో జన్మ అంటూ లేదనా? పాపం పుణ్యం లేవా? కర్మసిద్ధాంతం నమ్మరా!" ఆశ్చర్యంగా అడిగాడు రవీంద్ర.

" ఇవన్నీ అసమర్ధులు పెట్టుకున్న అపోహలయ్యా! మనకున్నది ఒకే జన్మ.. అది ఇదే ! కాబట్టి ఈ జన్మలో వీలైనంత సుఖపడటం నేర్చుకోవాలి! అబద్ధాల కరుల మాటలు నమ్మి మోసపోకూడదు.." బలరామయ్య చెప్పాడు.

" అయ్యో ! ఈ జన్మలో పుణ్యంచేస్తే వచ్చే జన్మలో మంచి జరుగుతుందని చెబుతారు.. అలాగే ఈ జన్నలో మనం సుఖపడుతున్నామంటే అది క్రిందటి జన్మ సుకృతం అంటారు"... రవీంద్ర.

" అదంతా పనీపాటలు లేనివాళ్లు కల్పి,చిన కథలు రవీంద్ర నీకోసంగతి తెలుసా.. చాలా మతాలలో పునర్జన్మ లేదు. వాళ్ళకు తెల్సింది. వర్తమాన జన్మే ! అందుకే వాళ్ళంతా ఆనందంగా బ్రతికేస్తున్నారు... అభివృద్ధి సాధిస్తున్నారు. ఒకవేళ నువ్వు చెప్పింది నిజమైతే పరంధామయ్య సుఖపడాలి గదా... ఎందుకు కష్టాలపాలయ్యాడు? అతను చాలా మంచివాడు గదా.. ఎవరికీ అపకారం చెయ్యలేదు కదా!" లా పాయింటు లేవదీశాడు బలరామయ్య.

రవీంద్ర అతని ధర్మ సందేహానికి కాస్త బిత్తరపోయాడు.. కాసేపటికి తేరుకున్నాడు. "నిజమే! ఈ జన్మలో అతను చాలా మంచి వాడే! కాని పూర్వ జన్మలో అతను చేసిన పాపం మనకు తెలియదు గదా... దాని ఫలితం ఈ కష్టాలై ఉండవచ్చు" చెప్పాడు.

" అవి నీలాంటి పలాయనవాదులు అనుకుంటారు. అతని జీవితంలో అతని అసమర్ధత మనకు స్పష్టంగా కనిపిస్తున్నది. గాలిలో దీపం పెట్టి దేవుడా నీవే దిక్కు అంటే దీపం ఆరిపోకుండా ఉంటుందా?" బలరామయ్య వాపోయాడు.

" ఐతే గత జన్మ లేదంటారా?" రవీంద్ర అడిగాడు.

" లేదు- లేదు- ఉందనడానికి నీకేమైనా రుజువుందా?"

" అది తరువాత చెబుతాను... లేదనడానికి మీ దగ్గర రుజువుందా? చెప్పండి?" రవీంద్ర అడిగాడు.

" ఎందుకు లేదు - ప్రతి ఒక్కళ్ళు అమాయకంగా - స్వచ్ఛంగా జన్మిస్తారు- వారికి పూర్వజన్మ ఉంటే దాని తాలూకు స్మృతి ఉండేది కదా! ఎవరూ పుట్టగానే మాట్లాడ్డం లేదు" ... బలరామయ్య.

" నిజమే... అంత మాత్రాన లేదని చెప్పగలమా? మీకు దేవుడిపైన నమ్మకం ఉందా? దేవుడ్ని నమ్ముతారా?" అడిగాడు రవీంద్ర.

" ఆ ! మనకు తెలియని ఒక శక్తి ఉంది. దాన్ని దేవుడు అని నువ్వంటే నాకేం అభ్యంతరం లేదు" బలరామయ్య.

" దేవుడు ఉన్నాడు... అనుకుంటే ఆయన చాలా గుణవంతుడు ... దయామయుడు.. ఆయనకు పక్షపాతం లేదు.. ఉండదు.. అని అంగీకరిస్తారా?" రవీంద్ర అడిగాడు.

" నేను అంగీకరించేదేంటిలే - అందరూ చెప్పేదే అది ... పెద్ద ఫారినర్లు.. గొప్ప మతస్తులు దేవుడు కరుణామయుడు అని చెబుతూ ఉంటారు.. ఆయన చాలా గొప్ప వాడయ్యా! కాకపోతే నేను నాస్తికుడ్ని కాదు కాని కర్మసిద్ధాంతం ఒప్పుకోను" బలరామయ్య గట్టిగా చెప్పాడు.

" మరి నాకు సందేహం ... కొందరు మీలాగా ధనవంతుల ఇళ్ళలో పుట్టి సుఖాలు అనుభవిస్తారు.. కొందరు దరిద్రుల ఇళ్ళలో పుట్టి కష్టాలు కొని తెచ్చుకుంటారు ఎందువలన? మరి కరుణామయుడైన దేవుడు కొందరిని గుడ్డివాళ్ళుగా ... కొందరిని కుంటివాళ్ళుగా.. కొందరిని రోగిష్టులుగా ఎందుకు పుట్టిస్తున్నాడు? కొందరికి పుట్టుకతోనే.. ఏ పాపం చేయకుండానే .. కష్టాలు ఎందుకు వస్తాయి... దేవుడు కఠినాత్ముడా? పక్షపాతా? శాడిస్టా?" రవీంద్ర బాణాల్లాగా కొన్ని సందేహాలు బలరామయ్యపైన సంధించాడు.

బలరామయ్య నిరుత్తరుడై ఆలోచిస్తూ ఉండిపోయాడు.

" చెప్పలేరు.. ఎందుకంటే కర్మసిద్ధాంతాన్ని నమ్మని ఎవరూ దీనికి జవాబు చెప్పలేరు కనుక. బలరామయ్య గారూ ! మీరు రెండు చేతులా సంపాదిస్తున్నారు... కాని రెండు చేతులా ఖర్చు పెట్టకుండా ఎక్కువ భాగం దాచుకుంటున్నారు.. ఎందుకోసం?" రవీంద్ర.

" భలేవాడివే! ఉన్నదంతా ఖర్చుచేస్తే రేపు మనకేమన్నా జరిగితే మనల్ని ఎవరు ఆదుకుంటారు? వృద్ధాప్యం కోసం దాచుకోవాలి గదా! అలా కాకపోయినా మన వారసులకు మనం సంపాదించి ఇవ్వాలి గదా? అందుకే వచ్చిందంతా ఏ తెలివి తక్కువ వాడు ఖర్చు చేయడు... భవిష్యత్తు కోసం దాచుకుంటారు" బలరామయ్య వివరించాడు. " దాచుకోని బ్రతుకు రిక్త బ్రతుకు".

" అంటే వృద్ధాప్యం అంటే – పదవీ విరమణ చేసింతర్వాత అనో ఒంట్లో ఓపిక పోయి మెత్తపడ్డతర్వాత అనో గదా మనం దాచుకోవడం. సగటున మనం డెబ్బై ఏళ్ళు జీవిస్తామనుకున్నా... ఓ పదేళ్ళు సుఖంగా బ్రతకడం కోసం ఇంత తాపత్రయ పడుతున్నాం.. ఇంత మూట వెనకేసుకుంటున్నాం కదా!" రవీంద్ర అడిగాడు. "రోత్మబతుకు కాకుండా ఉండాలని!"

" అవునయ్యా... పదేళ్ళు పదిహేనేళ్ళు మనం ఒకరిమీద ఆధారపడకుండా సుఖంగా బ్రతకాలి గదయ్యా... అందుకే దాచుకోవాలి!"

" కదా! మరి వచ్చే జన్మలో సుఖంగా ఉండాలని తమరు ఏం దాచుకుంటున్నారు? చెప్పండి !" రవీంద్ర అడిగాడు. " వచ్చే జన్మలేదని అనద్దు.. ఎందుకంటే నా ప్రశ్నలకు మీరు సమాధానం చెప్పలేక పోయారు. అలాగే పుట్టిన గంటల .. రోజుల పాప తనలో తాను నవ్వుకుంటుంది.... నవ్వు రావాలంటే మధురమైన సంఘటనలు నెమరు వేసుకోవాలి.. అప్పుడే పుట్టిన పాపకు నవ్వు వస్తుంది.. కాని ఆ పాపకు అటువంటి అనుభవాలు ఈ జన్మలో యింకా కలుగలేదు... కాబట్టి గత జన్మలోని స్మృతుల మూలంగా నవ్వుతున్నదనుకోవాలి. అందువలన ఏ సైంటిస్టు అయినా కూడా పూర్వజన్మ వుందని నమ్మాలి.. నమ్మకం లేనివాళ్ళు షిరిడీ సాయి చరిత్ర చదవండి. 'చెన్నప్ప –బసవప్ప' ల కథలు చదవండి.. పైగా బాబా తన వయస్సు లక్షల సంవత్సరాలని చెప్పారు.. ఎన్నో జన్మలుగా వీళ్ళంతా తనకు తెల్సు అని చెప్పారు.. కాబట్టి మనందరికి మరణం తరువాత జన్మ ఉంది.. అటువంటి పునర్జన్మ కోసం మనం ఏం దాచుకుంటున్నాం.. బలరామయ్యా గారు! మీరు ఎన్ని కోట్లు దాచుకున్నా.. ఎంతమందిని కన్నా.. ఏదీ .. ఎవరూ మీ వెంట రారు.. అందరూ స్మశానం దాకా వస్తారు.. ఆ పైన రారు.. ఆఖరికి మీతో జన్మించిన శరీరం కూడా స్మశానంలో కాలి బూడిదై పోతుంది... మీ వెంటరాదు .. కేవలం మీ పాపపుణ్యాలే మీ వెంట వస్తాయి... వాటిని బట్టే మీకు మరుజన్మ సంప్రాప్తమవుతుంది... పదేళ్ళు సుఖంగా ఉండాలని అష్టకష్టాలు పడి ప్రాకులాడే వాళ్లు... మరుజన్మలో సుఖంగా బ్రతకాలంటే కాస్తన్నా పుణ్యం మూట కట్టుకోండి!" రవీంద్ర దీర్ఘంగా విశ్వసించాడు.

ఇంతలో 'భవతీ భిక్షాందేహి' అంటూ మొదట్లో వచ్చిన ముసలాడు అరిచాడు గట్టిగా. బలరామయ్య మొహం జేవురించింది. రవీంద్ర కూడా తికమక పడ్డాడు. రవీంద్ర బయటకొచ్చాడు... అతనితో పాటు బలరామయ్య కూడా బయటకు వచ్చాడు.

" క్షమించాలి బాబయ్యా ! ఇందాక ఈ బాబు దానం చేసినా యాభై నోటు చెల్లదని హోటలు అతను నా మొహాన కొట్టాడు.. ఎంత ముసలాడినైనా .. ఎంత బీదోడినైనా దొంగనోటు దానం చేసి పుణ్యం సంపాదిద్దామనుకున్నారా బాబూ!" అతను రవీంద్రను నిలదీశాడు.

" సారీ ! పుణ్యాత్ములెవరో .. పాపాత్ములెవరో తెలియనట్లు.. ఏది మంచినోటో, ఏది దొంగనోటో తెల్సుకోవడం కష్టమై పోతున్నది. సాక్షాత్తు రిజర్వు బ్యాంకువాళ్ళు రోజుకు కోటిరూపాయల దొంగనోట్లు కాల్చేస్తున్నారు... ఆ యాభైకి బదులుగా ఈ వంద ఉంచుకో!" రవీంద్ర జేబులోంచి వంద తీసిచ్చాడు.

" దీనికి మధ్యలో సిల్వర్ త్రెడ్ ఉందా బాబు!" అంటూ ఎండలో పరీక్షించాడు ఆ ముసలాడు. తలాడించి జేబులో పెట్టుకున్నాడు.

" ఇచ్చింది తీసుకుపో.. అధిక ప్రసంగం చెయ్యకు" కసిరాడు బలరామయ్య.

" క్షమించాలి.. ఒకప్పుడు మీలాగే బాగా బ్రతికినవాడ్ని... ఏ పాపం చేశానో ఏమో ఈ జన్మలోనే ఇలా అనుభవిస్తున్నా!" అంటూ వెళ్లి పోయాడు ముసలాడు.

" అడుక్కుతినేవాళ్ళకు తలపొగరు ఎక్కువైపోయింది" కామెంటు చేశాడు బలరామయ్య " వంద ఇచ్చినా విశ్వాసం లేదు."

" సారీ బలరామయ్య గారు పాపం ! ఆ ముసలాడి నేమనకండి... అతనే పరంధామయ్య.. నే చెప్పిన కథలో హీరో!" రవీంద్ర చెప్పాడు.

బలరామయ్య అవాక్కయ్యాడు.

" అతను నీకెలా తెల్సు !" తడారిపోతున్న గొంతుతో అడిగాడు.

" ఆయన నన్ను గుర్తు పట్టలేదు... మా పెళ్ళి ఆయన పుణ్యం వల్లనే జరిగింది.. దగ్గరుండి చేయించారు. దాదాపు ఇరవై ఏళ్ళలో నాలో మార్పు వచ్చి ఆయన నన్ను గుర్తుపట్టలేదు" రవీంద్ర చెప్పాడు బాధగా.

" నాకేం అర్థంగావడం లేదు... ఆయన చేయించడమేమిటి?"

" ఆ .. నేను పెళ్ళి చేసుకుంది రామలింగయ్య కూతుర్ని... మా మామగారే రామలింగయ్య!" రవీంద్ర చెప్పాడు. " ఆయన ఊరువేరు. నా ఊరు వేరు రావడం వలన ఆయన నన్ను గుర్తుపట్టలేదు.... ఆత్మాభిమానం ఆయనకు జాస్తి అఇన నాకు తెలుసు .. అందుకే గుర్తు చెయ్యలేదు... కాని మా మావగారు ఆయన మంచితనం ఇప్పటికీ చెప్పుకుంటూ ఉంటారు.."

" సారీ రవీంద్ర ! ఈసారి అతనొస్తే నేను కూడా నాకు చేతనైన సాయం చేస్తాను గుప్తంగా ! నువ్వు చెప్పింది వింటూ ఉంటే గత జన్మపైన ... పూర్వజన్మపైన నాకున్న సందేహాలు తొలగుతున్నాయి" బలరామయ్య చెప్పాడు. చెమట తుడుచుకుంటూ.

– శ్రీ సర్వజిత్ దీపావళి ప్రత్యేక సంచిక 2007